క్లుప్తంగా

రూ.54 లక్షలతో గర్భాలయానికి ఇత్తడి రేకులు



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి ఆలయ గర్భాలయంలోని గోడలకు సుమారు రూ.54 లక్షలతో ఇత్తడి రేకులను ఏర్పాటు చేసి బంగారు పూత వేయించనున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. దాతలతో కలిసి శుక్రవారం గర్భాలయ గోడలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చొరవతో నెల్లూరుకు చెందిన పీడూరు శంకర్‌రెడ్డి, ప్రణస్మిత దంపతులు అమ్మవారి గర్భాలయ గోడలకు సుమారు 350 కేజీల ఇత్తడి రేకులను ఏర్పాటు చేసి వాటిపై బంగారు పూతను వేయించేందుకు ముందుకొచ్చారని తెలిపారు. నెల్లూరుకు చెందిన సీఎంఆర్ షాపింగ్‌మాల్ యజమాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పనులు జరుగుతాయన్నారు. అమ్మవారి దగ్గర ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, సీఎంఆర్ షాపింగ్‌మాల్ మేనేజర్ వాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మనుబోలు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కలికి సుధీర్‌రెడ్డి మోటార్‌బైక్‌పై నెల్లూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆగి ఉన్న ట్యాంకర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సుధీర్ ముఖంపై తీవ్ర గాయమైంది. అతడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తొలుత నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాల కోసం చోరీలు, గంజాయి విక్రయం



ముత్తుకూరు: వారంతా స్నేహితులు. దొంగలుగా మారారు. ఇంకా గంజాయి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముత్తుకూరు పోలీసులు ముగ్గురు వ్యక్తులను చాకచక్యంగా పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, ఎస్సై శివకృష్ణారెడ్డి వివరాలు వెల్లడించారు. నెల్లూరుకు చెందిన కంచు సురేష్, బుజ్జా శ్రీలేష్, గుండ్రాతి సిద్ధూ, పోలాని కిశోర్ స్నేహితులు. చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో చోరీలు చేయడం ప్రారంభించారు. మనుబోలు, పొదలకూరు, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లోని పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ఇటీవల జైలు నుంచి విడులైన ముత్తుకూరు మండలానికి చెందిన అరవ వినోద్ కూడా వారితో కలిసి పొట్టెంపాడు, దుత్తపాడులో చోరీలు చేశాడు. నెల్లూరులో గంజాయి కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు అమ్మకాలు చేయడం అలవాటు చేసుకున్నారు. అడిషనల్ ఎస్పీ హిమవతి పర్యవేక్షణలో పోలీసులు సీఐ వేమారెడ్డితో కలిసి గాలింపు చేపట్టారు. గురువారం సాయంత్రం వారంతా మోటార్‌బైక్‌లపై వస్తుండగా బ్రహ్మదేవి వద్ద పట్టుకునేందుకు ప్రయత్నించారు. సిద్ధూ, శ్రీలేష్, వినోద్ మాత్రం దొరికారు. సురేష్, కిశోర్ పరారయ్యారు. నిందితుల నుంచి రూ.70,000 నగదు, మూడున్నర కిలోల గంజాయి, 2 సవర్ల బంగారు ఆభరణాలు, రెండు మోటార్‌బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అనంతరం కోర్టుకు హాజరుపరిచారు.

ఈతకెళ్లి విద్యార్థి మృతి

వెంకటాచలం: సరదాగా ఈతకు వెళ్లి విద్యార్థి మృతిచెందిన ఘటన మండలంలోని అనికేపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తురకా అనిల్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు వెంకయ్య (9) అనే పిల్లలు ఉన్నారు. వెంకయ్య పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం పాఠశాల ముగిసిన తర్వాత వెంకయ్య స్థానికంగా ఉంటున్న మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి గ్రామానికి సమీపాన ఉన్న సర్వేపల్లి రిజర్వాయర్ నీటి గుంత వద్దకు ఈతకు వెళ్లాడు. వెంకయ్య ముందుగా నీటిలో దిగాడు. ఒక్కసారిగా లోతైన గుంతలో మునిగిపోయాడు. గట్టుపై ఉన్న ఇద్దరు విద్యార్థులకు వెంకయ్య కనిపించకపోవడంతో గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పారు. గ్రామస్తులు మత్స్యకారుల చేత నీటి గుంతలో వెతికించారు. వారు వెంకయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. బాలుడి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

అధునాతన టాయ్‌లెట్లు

- రూ.5.5 కోట్లతో ఏర్పాటు
- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం

నగరంలో ఎన్ని	62
నూతనంగా నిర్మించినవి	18
ఆధునికీకరించినవి	28
గతం నుంచి ఉన్నవి	16



స్వచ్ఛ మరుగుదొడ్లు

నెల్లూరు(బారకాసు): బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిర్మూలన దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులేస్తున్నాయి. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఇప్పటికే అనేక చర్యలు చేపట్టాయి. తాజాగా నగరంలో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ప్రత్యేక చర్యలు

జిల్లా నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది వివిధ పనుల నిమిత్తం నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో మల, మూత్ర విసర్జన చేయాలంటే అవస్థ పడాల్సి వస్తోంది. పరిస్థితిని గుర్తించిన నెల్లూరు నగరపాలక సంస్థ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. నగరంలో జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణాలను చేపట్టింది. కమ్యూనిటీ టాయ్‌లెట్లు గతంలో కొన్నే ఉండేవి. ప్రస్తుతం వీటికి అదనంగా మరికొన్నింటిని నిర్మించారు.

పలు సంస్థల నిర్వహణ

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్లను నిర్వహణ నిమిత్తం పలు సంస్థలకు ఉచితంగా అప్పగించారు. ముంబైకి చెందిన సులభ్ కాంప్లెక్స్, హైదరాబాద్‌కు చెందిన దుర్గా సేవా సమితి, గుంటూరుకు చెందిన సులభ్ ఇంటర్నేషనల్ సంస్థలు ప్రజా మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతున్నాయి. సేవలను వినియోగించుకునేందుకు కొంత రుసుమును వసూలు చేస్తున్నారు. నగరపాలక సంస్థ చర్యలతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

500 మీటర్లకు ఓ టాయ్‌లెట్

నగరపాలక సంస్థ పరిధిలో 62 పబ్లిక్ టాయ్‌లెట్లు ఉన్నాయి. రూ.5.5 కోట్లను వెచ్చించి కొన్నింటిని నూతనంగా నిర్మించగా, మరికొన్నింటికి మరమ్మతులు చేసి అధునాతనంగా తీర్చిదిద్దారు. ఒక్కో దానికి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వెచ్చించారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు ప్రధాన రహదారిపై, నర్తకి సెంటర్, సంతపేట, ములుమూడి బస్టాండ్, తడికలబజార్.. ఇలా ప్రతి 500 మీటర్లకో టాయిలెట్ చొప్పున నిర్మించారు. ఇందులో కొత్తవి 18, ఆధునికీకరించినవి 28 ఉన్నాయి. వీటిలో నాలుగింటిని అధునాతనంగా తీర్చిదిద్దారు. గాలి, వెలుతురు, నీటి సౌకర్యం, విద్యుత్, తదితర సౌకర్యాలను కల్పించారు. దివ్యాంగులకు సైతం అనువుగా వీటిని ఏర్పాటు చేశారు.

మరుగుదొడ్ల ఏర్పాటు సంతోషకరం

నెల్లూరుకు తరచూ వస్తుంటాం. అత్యవసర సమయాల్లో బాత్‌రూమ్‌కు వెళ్లాలంటే మహిళలు పలు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. నగరంలోని పలు ప్రాంతాల్లో అధునాతనంగా మరుగుదొడ్లను నిర్మించారు.

- లక్ష్మి, ముత్తుకూరు మండలం

నిర్మాణం అభినందనీయం



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో మరుగుదొడ్లను నిర్మించారు. అత్యవసర సమయాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా వీటిని నిర్మించడం అభినందనీయం.

- చీమలమర్రి సుధాకర్, బాలాజీనగర్



ఏర్పాటు చేసిన వసతులు

వైఎస్సార్‌సీపీని మరింతగా ఆదరించాలి



సంక్షేమ పథకాలపై బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు మరింతగా ఆదరించాలని ఎంపీ, పార్టీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. 18వ డివిజన్లోని హరనాథపురం మూడో వీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డివిజన్లోని సమస్యలను స్థానిక నేతలను అడిగి తెలుసుకొని, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లోనూ పార్టీని గెలిపించి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ అశోక్, ఏసు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’పై అలసత్వం తగదు



టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటసుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. నగరంలోని విద్యుత్ భవన్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో టెలి కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గానూ ప్రభుత్వం చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి పరిష్కరించి ఫిర్యాదుదారుల ఫొటోతో ఆన్‌లైన్లో నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులను 30 రోజుల్లో మంజూరు చేయాలని ఆదేశించారు. జగనన్న గృహాలకు విద్యుత్ సర్వీసులను వెంటనే మంజూరు చేయాలని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఆటో..ఎటో..!



నగరంలో ఆటోలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. పైగా ఎక్కడిపడితే అక్కడ ఆటోలను నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. సమస్యను అధికారులు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

జీజీహెచ్‌లో వైద్య శిబిరం



నెల్లూరు (వేదాయపాళెం): నగరంలోని జీజీహెచ్ ఆవరణలో ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ జాషువా డానియెల్ మాట్లాడారు. కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాలను మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వింజమూరు, నెల్లూరు, కావలి కేంద్రాల్లో ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. డీఎంహెచ్ఓ పెంచలయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్, తదితరులు పాల్గొన్నారు.

సజ్జలకు ఘన సన్మానం



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కొడవలూరు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లిలోని కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. మధురై నుంచి సుగంధభరితమైన లవంగాలు, యాలికలతో ప్రత్యేకంగా తయారు చేయించిన పూలమాలతో సన్మానించారు.

డస్ట్ బిన్లను విధిగా ఏర్పాటు చేసుకోవాలి



చెత్తను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి మెరుగైన పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని, అదే విధంగా దుకాణాల వద్ద డస్ట్ బిన్లను విధిగా ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. బట్వాడిపాళెం, అలంకార్ సెంటర్, కోటమిట్ట రోడ్డు, చేపల మార్కెట్ పరిసరాలు, బారకాస్ సెంటర్, మద్రాస్ బస్టాండ్, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఓ బార్ పరిసరాల్లో ప్లాస్టిక్, లిక్కర్ సీసాలు, పేపర్లు, ప్లాస్టిక్ కవర్లు ఉండటాన్ని గమనించిన కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గానూ జరిమానాను విధించాలని ఆదేశించారు. కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ సిల్ట్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఎంహెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆడిటర్లకు ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న రఫీ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆడిటర్లకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మున్సిపాల్టీల్లో ఆడిట్‌ను ఎలా చేయాలనే అంశంపై నగరపాలక సంస్థ ఎగ్జామినర్ మహ్మద్ రఫీ శిక్షణ ఇచ్చారు. సహాయ ఆడిట్ అధికారులు మధుబాబు, హరికృష్ణ, సీనియర్ ఆడిటర్లు రామకృష్ణరాజు, సుబ్రమణి, భాస్కర్, సత్యనారాయణ, కవిత, నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎన్టీఆర్‌నగర్, రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఎన్టీఆర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతీనగర్, మోడరన్ స్కూల్, రమణయ్య స్టోర్స్, రాయపుపాళెం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని చెప్పారు.
- రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆదిత్యనగర్, బాలాజీనగర్, పుట్టవీధి, గుర్రాలమడుగు సంఘం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

నెల్లూరు(బృందావనం): నిరుపేద ముస్లిం యువతి వివాహానికి 48వ డివిజన్ పొర్లుకట్టలోని బదర్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో రూ.5500 ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. మసీదులో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుడు హాఫిజ్ ఖలీల్ అహ్మద్, కరీముద్దీన్ సాహెబ్, యాకూబ్ సాహెబ్, జాఫర్‌జాన్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడలో ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ నిత్యాన్నదానం కోసం దాతలు ఈ ప్రత్యేక కౌంటర్‌లో విరాళాలను అందించాలని కోరారు. ఇప్పటి వరకు విరాళాలను దేవస్థాన అధికారి కార్యాలయంలో తీసుకునేవారని చెప్పారు. ఇకనుంచి కొత్త కౌంటర్‌లో స్వీకరిస్తారన్నారు. అనంతరం కౌంటర్ వద్ద అమ్మవారి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, అర్చకులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు బ్యాంకు రుణాలు

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుంటున్న పొదుపు సంఘాల మహిళలు బ్యాంకులు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ రవీంద్ర సూచించారు. స్థానిక బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కో లబ్ధిదారుకు రూ.35 వేల రుణం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని ఇంటి నిర్మాణం కోసం వినియోగించుకోవాలన్నారు. దీనిపై మెప్మా సీఎంఎం, సీఓలు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం పలువురికి బ్యాంకు రుణాల కింద నగదును అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది అంకయ్య, సుధాకర్, నర్మద పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

కొడవలూరు: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అక్కడ వారికి ఆటపాటలతో కూడిన విద్యనందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి తెలిపారు. మండలంలోని కొత్తవంగల్లు మజరా చీకిరేణిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జన భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారని, దీంతో వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, సుప్రజ, భారతి, కుమారి, కామేశ్వరి పాల్గొన్నారు.

- కొడవలూరులో ఎన్టీఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జన భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఉన్న ప్రీస్కూల్ పిల్లలను గుర్తించి అంగన్‌వాడీల్లో పేర్లు నమోదు చేయించడంతోపాటు కేంద్రానికి వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

నగదు ప్రోత్సాహకాల ప్రదానం రేపు

నెల్లూరు(బృందావనం): నగర పరిధిలోని కార్పొరేషన్, జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన 37 మంది విద్యార్థులకు రూ.ఐదు వేల చొప్పున ప్రోత్సాహక బహుమతిని ఆదివారం సాయంత్రం అందజేయనున్నామని టౌన్‌హాల్ ట్రస్ట్ బోర్డు సెక్రటరీ జేఎస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని పురమందిరంలో నిర్వహించనున్నామని చెప్పారు.

డాక్టరేట్ ప్రదానం



రజని

నెల్లూరు (టౌన్): విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) విద్యార్థి వేముల రజనికి డాక్టరేట్ లభించింది. విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్మయి పర్యవేక్షణలో పరిశోధన చేసి గ్రంథాన్ని సమర్పించారు. ఈ క్రమంలో ఆమెకు డాక్టరేట్‌ను వీఎస్‌యూ ప్రదానం చేసింది.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): మేయర్ స్రవంతిని కార్పొరేషన్ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో డిప్యూటీ సిటీ ప్లానర్ దేవీకుమారి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. అనంతరం టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. నగరాభివృద్ధికి కృషి చేయాలని మేయర్ సూచించారు.

విద్యా సంస్థలపై చర్యలకు వినతి

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యాశాఖ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ లక్షల్లో ఫీజులు, పాఠశాలల్లోనే పుస్తకాలను విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న బస్సులను తనిఖీ చేసి కేసులు నమోదు చేయాలని కోరారు.

క్రైమ్ కార్నర్

గంజాయి విక్రయాలపై దాడులు



నిందితులతో ఎస్ఈబీ అధికారులు

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయాలపై ఎస్ఈబీ అధికారులు దాడులు జరిపి నలుగుర్ని అరెస్ట్ చేశారు. ఎస్ఈబీ అధికారుల సమాచారం మేరకు.. కపాడిపాళెంలో జహీరాబీ, స్రవంతి ప్రియ, సువర్ణ ప్రకాష్, హరిబాబురెడ్డి కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. దీనిపై ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి ఫిర్యాదులు అందాయి. ఆయన ఆదేశాల మేరకు ఏఎస్పీ హిమవతి పర్యవేక్షణలో ఎస్ఈబీ నెల్లూరు – 1 ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు, తదితరులు గురువారం అర్ధరాత్రి దాడి చేశారు. విక్రయదారులను అరెస్ట్ చేసి వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని తమదైన శైలిలో విచారించగా, మరో ఐదుగురు నిందితుల వివరాలను వెల్లడించారు. వీరి కోసం గాలిస్తున్నామని అధికారులు తెలిపారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీకి గురైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. లేక్‌వ్యూ కాలనీ ఐదో వీధిలో నివాసం ఉంటున్న రాజశేఖర్ తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు ఈ నెల 13వ తేదీ రాత్రి నిలిపారు. మరుసటి రోజు ఉదయానికి బైక్ అదృశ్యమైంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.